

పంచమి తీర్థానికి సర్వం సిద్ధం


చక్రస్నానానికి సిద్ధమైన పుష్కరిణి

రేపు పుష్పయాగం

శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో ఆదివారం సాయంత్రం పుష్పయాగాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలు ముగిసిన మరుసటి రోజు అమ్మవారికి పుష్పయాగం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. సాయంత్రం 5 నుంచి 8గంటల వరకు భక్తులు, దాతలు సమకూర్చిన దాదాపు నాలుగు టన్నుల పుష్పాలు, పత్రాలతో పుష్పయాగం నిర్వహించనున్నారు.

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో చివరి ఘట్టమైన పంచమితీర్థం (చక్రస్నానం) శనివారం ఉదయం 12.10 గంటలకు అత్యంత వైభవంగా జరగనుంది. లక్షలాది మంది భక్తులు పవిత్ర స్నానమాచరించేందుకు తిరుచానూరుకు తరలిరానున్నారు. దీనికోసం అన్ని ఏర్పాట్లను టీటీడీ అధికారులు పూర్తిచేశారు. చక్రస్నానం కోసం పుష్కరిణిని సుమారు రూ.9 కోట్లతో ఆధునీకరించారు. చక్రస్నానం జరిగే ప్రాంతంలో పటిష్టంగా స్టీల్‌తో గ్రిల్స్‌ను ఏర్పాటుచేశారు. వీవీఐపీ, వీఐపీ, ఉద్యోగులకు ప్రత్యేకంగా గ్యాలరీలను ఏర్పాటుచేశారు. చక్రస్నానం అనంతరం భక్తులకు తోళప్పగార్డెన్, జెడ్పీ హైస్కూల్ ప్రాంగణం, అయ్యప్పస్వామి ఆలయ సమీపంలో అన్నప్రసాదాలను పంపిణీ చేసేందుకు తాత్కాలిక జర్మన్ షెడ్లను ఏర్పాటు చేశారు. రద్దీని క్రమబద్ధీకరించేలా సింధు జంక్షన్ నుంచే గేట్లు ఏర్పాటు చేశారు. ప్రైవేటు బస్టాండు, ఘంటశాల విగ్రహం వద్ద ప్రత్యేక బ్యారికేడ్లను ఏర్పాటు చేశారు. పుణ్యస్నానమాచరించేందుకు భక్తులు శుక్రవారం రాత్రే తిరుచానూరుకు చేరుకున్నారు. పుష్కరిణిలోకి ఉదయం 9గంటల తరువాత పాత పోలీస్‌స్టేషన్ మార్గంలో అనుమతించనున్నారు.

భారీ పోలీస్ బందోబస్తు

పంచమితీర్థానికి భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. అర్బన్ ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి నేతృత్వంలో ఐదుగురు ఏఎస్పీలు, 15 మంది డీఎస్పీలు, 55 మంది సీఐలు, 136 మంది ఎస్ఐలు, 208 మంది ఏఎస్ఐ, హెడ్‌కానిస్టేబుళ్లు, 753 మంది కానిస్టేబుళ్లు, 127 మంది మహిళా కానిస్టేబుళ్లు, హోంగార్డు 107, 230 స్పెషల్ పార్టీలతో గట్టి భద్రతను కల్పించారు. 170సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు.

నేడు అమ్మవారికి శ్రీవారి సారె

కార్తీక బ్రహ్మోత్సవాల్లో చివరి ఘట్టమైన పంచమి తీర్థా(చక్రస్నానం)నికి తన దేవేరి శ్రీపద్మావతి అమ్మవారికి తిరుమల నుంచి శ్రీవారి తరఫున ముత్తైదువు సారె అందించడం అనాధిగా వస్తున్న ఆచారం. ఇందులో భాగంగా శనివారం వేకువ జాము తిరుమలలో జీయ్యర్ స్వాముల సమక్షంలో పట్టుచీర, పసుపు, చందనం, కుంకుమ, బంగారు తిరువాభరణాలు, అన్నప్రసాదాలు తదితర ముత్తైదువు సారెతో శ్రీవారి ప్రతినిధిగా టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ధర్మారెడ్డి, ఏకాంగులు, అర్చకపరిచారకులు కాలిమార్గాన అలిపిరికి చేరుకోనున్నారు. అక్కడి నుంచి కోమలమ్మ సత్రం, కోదండరామాలయ, గోవిందరాజస్వామి ఆలయం, ఆర్టీసీ బస్టాండు, లక్ష్మీపురం మీదుగా తిరుచానూరు ముఖద్వారం వద్ద ఉన్న పసుపు మండపానికి తీసుకురానున్నారు. అక్కడ సారెకు ప్రత్యేక పూజలు నిర్వహించి తిరువీధుల్లో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి తీసుకురానున్నారు. అక్కడి నుంచి పంచమితీర్థం మండపానికి తీసుకువచ్చి, సారెను అమ్మవారికి సమర్పించనున్నారు.

పథకాలన్నీ ముంగిటకే



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలన్నీ ప్రజల ముంగిటకే చేరుతున్నాయి. దీర్ఘకాలంగా పేరుకుపోయిన సమస్యలు ఒక్కొక్కటీ పరిష్కారమవుతున్నాయి. పింఛను నుంచి ఆదాయపు పన్ను వరకు అన్నీ సమసిపోతున్నాయి. కష్టకాలంలో సీఎం జగనన్న దేవుడిలా ఆదుకుంటున్నారని ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

–సాక్షి, నెట్‌వర్క్

భూ సమస్య తీరింది



మా తండ్రి వెంకటయ్య మృతిచెంది 18 ఏళ్లు అయ్యింది. మా తండ్రి పేరుపైన 2.67 ఎకరాల భూమి ఉంది. ఈ భూమి మా తండ్రి పేరుపై ఉండటంతో ప్రభుత్వానికి సంబంధించి రైతుభరోసా, పీఎంకిసాన్ వంటి పథకాలు అందేవి కావు. మా తండ్రి పేరుపై ఉన్న పొలాన్ని నాపైన మార్చుకునేందుకు చాలా కాలంగా తిరిగాను. గత కొద్దిరోజుల క్రితం మోకాలు ఆపరేషన్ కారణంగా కార్యాలయాలకు తిరగలేకపోయాను. జగనన్న సురక్ష పథకం ద్వారా నేరుగా వలంటీరే మా ఇంటికి వచ్చి సమస్య తెలుసుకున్నాడు. నా తండ్రి పేరుపైన ఉన్న వ్యవసాయ భూమిని నాపేరుపై మార్చి సర్టిఫికెట్ మంజూరు చేయించారు. చాలా ఆనందంగా ఉంది.

- నట్టేరి నరసింహులు, ముద్దంపల్లి, వెంకటగిరి రూరల్ మండలం

రేషన్‌కార్డు వచ్చింది



మాది వరదయ్యపాళెం మండలం, ఇందిరానగర్ పంచాయతీ, పద్మావతీపురం గ్రామం. ఆదాయపు పన్ను చెల్లిస్తున్నట్లు రావడంతో రేషన్‌కార్డును గతంలో కోల్పోయాను. అయితే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వలంటీర్ మా ఇంటికి వచ్చిన సమస్య తెలుసుకున్నారు. వెంటనే జగనన్న సురక్షలో తిరిగి రేషన్‌కార్డు ఇప్పించారు. ఇప్పుడు నిత్యావసర సరుకులు తిరిగి పొందుతున్నాను. సంతోషంగా ఉంది.

-కే.సెల్వి, వరదయ్యపాళెం మండలం

మోకాళ్లనొప్పులు తగ్గాయి



మాది పెళ్లకూరు మండలం, తాళ్వాయిపాడు అరుంధతి కాలనీ. గత కొంతకాలంగా మోకాళ్ల నొప్పులతో బాధపడేవాడ్ని. అయితే ఇటీవల నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రత్యేక వైద్య నిపుణులచేత వైద్య పరీక్షలు చేయించుకున్నా. వైద్యుల సూచనల మేరకు ఫిజియోథెరపీ చేయించుకోవడంతో పాటు, సరైన వైద్యం అందింది. ఇప్పుడు మోకాళ్ల నొప్పులు పూర్తిగా నయమయ్యాయి. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక ఆసరా పథకంతో పాటు వలంటీర్ల వల్ల అనేక పనులు సులభంగా చేసుకోగలుగుతున్నాను.

వంకపూరి చెంగయ్య, తాళ్వాయిపాడు అరుంధతి కాలనీ, పెళ్లకూరు మండలం

ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్



గతంలో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం నెలలు తరబడి తిరిగాను. ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకున్నాను. తర్వాత తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగాను. అయినా సర్టిఫికెట్ రాలేదు. జగనన్న సురక్ష పథకం ద్వారా అధికారులే మా ఇంటి దగ్గరకు వచ్చి సమస్య తెలుసుకున్నారు. ఒకే రోజులో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఉచితంగానే ఇచ్చి ఆదుకున్నారు. ఈ పథకం ఎంతో మేలుచేకూర్చింది.


ఎర్రమ్మ, సైదాపురం

అవార్డు గ్రహీతకు వీసీ అభినందనలు


అలీఖాన్‌ను అభినందిస్తున్న ఎస్వీయూ వీసీ

తిరుపతి కల్చరల్: ఎస్వీయూ ఉర్దూ విభాగం గెస్ట్ లెక్చరర్ అంజాద్ అలీఖాన్ ప్రభుత్వం నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. ఈ మేరకు శుక్రవారం ఎస్వీయూనివర్సిటీలోని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతను ఎస్వీయూ వీసీ కె.రాజారెడ్డి, రిజిస్ట్రార్ హుస్సేన్‌తోపాటు తోటి అధ్యాపక బృందం శాలువాతో ఘనంగా సత్కరించి, అభినందించారు.

కలాం పేరిట ప్రతిభా అవార్డులివ్వాలి


మాట్లాడుతున్న డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్: చదువులో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు దివంగత రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం పేరిట ప్రతిభా అవార్డులను ప్రభుత్వం అందించి ప్రోత్సహించాలని అప్‌స్మా నాయకులు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి విజ్ఞప్తి చేశారు. సంకల్ప సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం విశ్వం విద్యాసంస్థలో విద్యార్థులకు అబ్దుల్ కలాం జీవిత చరిత్రపై వకృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అబ్దుల్ కలాం జయంతిని అధికారికంగా అంతర్జాతీయ విద్యార్థుల దినోత్సవంగా నిర్వహించాలని, అదేరోజు ప్రతిభావంతులైన విద్యార్థులకు కలాం పేరున ప్రతిభా అవార్డులు ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. సంకల్ప సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రాజారెడ్డి, కార్యదర్శి షేక్ మహమ్మద్ రఫీ, గీతం విద్యాసంస్థల అధినేత డాక్టర్ తమ్మినేని వెంకటేశ్వర్లు, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ అద్భుతం

– కొనియాడిన కేంద్ర బృందం


తనపల్లి సచివాలయం వద్ద కేంద్ర బృందం

తిరుపతి రూరల్: రాష్ట్రంలో అమలు చేస్తున్న సచివాలయ వ్యవస్థ అద్భుతమని, దీనివల్ల గ్రామీణులకు సత్వర సేవలు అందుబాటులోకి వస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం తరుపున రాష్ట్రంలో పర్యటిస్తున్న యువ అధికారుల బృందం కొనియాడింది. క్షేత్ర స్థాయిలో గ్రామీణుల జీవన విధానం మెరుగుపరిచేందుకు చేపట్టాల్సిన చర్యలపై పరిశీలించేందుకు జాతీయ సహజవనరుల శాఖకు చెందిన శుభంజాన్‌గ్రా, జౌళి శాఖకు చెందిన హరీష్‌విహల్డి, ఇండస్ట్రీ, కామర్స్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన యోగేష్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖకు చెందిన దంబీర్‌యాదవ్, పెట్రోలియం శాఖకు చెందిన రాహుల్‌జైన్‌తో కూడిన ఐదుగురు యువ అధికారుల బృందం రాష్ట్రంలో పర్యటిస్తోంది. అందులో భాగంగా శుక్రవారం తిరుపతి రూరల్ మండలంలోని పెరుమాళ్లపల్లిలోని గ్రామ సచివాలయం, ఎస్‌డబ్ల్యూపీయస్ సెంటర్, తనపల్లి పంచాయతీలోని రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్, సచివాలయం, స్త్రీశక్తి భవన్‌లను సందర్శించారు. వాటి పనితీరు, అక్కడ పనిచేస్తున్న సిబ్బంది విధులు, గ్రామీణులకు అందిస్తున్న సేవలు వంటి అంశాలపై క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్వచ్ఛభారత్ మిషన్, స్వచ్ఛభారత్ అభియాన్ కార్యక్రమాలను సందర్శించారు. సచివాలయ వ్యవస్థ వల్ల గ్రామీణులకు అద్భుత ఫలితాలు అందుతున్నాయని కొనియాడారు. పల్లె ప్రజలు శుభ్రత–పరిశుభ్రతపై అవగాహన పెంచుకొని స్వచ్ఛ భారత్ మిషన్, స్వచ్ఛ భారత అభియాన్ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొని వై బ్రాండ్ గ్రామాలుగా తీర్చిదిద్దే యజ్ఞంలో భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. కేంద్రబృందానికి తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న కార్యక్రమాలపై కేంద్ర బృందానికి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. తిరుపతి డీఎల్‌పీఓ రూపరాణి, ఈఓపీఆర్డీ గిరిధర్ రెడ్డి, ఈవో మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

భూకబ్జాదారుడు జయకృష్ణ యాదవ్


మాట్లాడుతున్న శ్రీకాళహస్తి వాసులు

తిరుపతి కల్చరల్: నిత్యం దౌర్జన్యాలు, భూకబ్జాలకు పాల్పడుతున్న జయకృష్ణ యాదవ్ రౌడీషీటర్‌గా అతనిపై అనేక కేసులు నమోదయ్యాయని, టీడీపీ శ్రీకాళహస్తి ఇన్‌చార్జ్ బొజ్జల సుధీర్‌రెడ్డి అండతో బరితెగించి దౌర్జనాలకు పాల్పడుతున్నాడని శ్రీకాళహస్తికి చెందిన రాధా, బాబూరావు, మహ్మద్ ఆరోపించారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మిట్టకండ్రిగ వద్ద తమ భూమికి దారి ఏర్పాటు చేసుకుంటుంటే అడ్డుకొని ఆ స్థలాన్ని కూడా కబ్జా చేసేందుకు జయకృష్ణ యాదవ్ ప్రయత్నిస్తున్నారన్నారు. మెయిన్ రోడ్డు పక్కన మూడన్నర ఎరకాల స్థలం ఉందని, తమ భూమి తర్వాత అతని భూమి ఉండడంతో తమ భూమి నుంచి అతని భూమికి దారి ఇవ్వాలని దౌర్జన్యం చేస్తున్నాడని తెలిపారు. నిరంతరం ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్న శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే బియ్యపు మధుసూధన్‌రెడ్డికి సంబంధం లేకున్నా ఆయనపై నిందారోపణలు చేయడం దుర్మార్గమన్నారు. నేర చరిత్ర కలిగిన జయకృష్ణ యాదవ్ శ్రీకాళహస్తిలో టీడీపీ అండతో అనేక అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రెండేళ్ల క్రితం మహ్మద్‌కు చెందిన బేకరీలో స్వీట్లు ఉచితంగా ఇవ్వలేదని వారిపై దాడి చేయడంతో పోలీసులు అరెస్ట్ చేశారని గుర్తుచేశారు. ఇతని ఆరాచకాలను సహించలేని యాదవ వర్గానికి చెందిన వారు సైతం యాదవ సంఘం నుంచి వెలివేశారని తెలిపారు. డీకేటీ భూమిని సైతం కబ్జా చేసి భవంతి కట్టుకొని అక్కడే కాపురం ఉంటున్నాడన్నారు. అక్రమాలు, దౌర్జన్యాల కారణంగా కేసులతో జైలుకెళ్తే ఎమ్మెల్యే తనను జైల్లో పెట్టించారని తప్పుడు ప్రచారం చేయడం దారుణమన్నారు.

క్లుప్తంగా

నిర్మాణంలో ఉన్న రోడ్ల పరిశీలన



తిరుపతి తుడా: నగరపాలక సంస్థ పరిధిలోని 13, 14వ వార్డులలో నిర్మాణంలో ఉన్న రోడ్లను, డ్రైనేజ్ సిస్టమ్‌ను డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ గురువారం కార్పొరేటర్లతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల నాణ్యతను తనిఖీ చేసి త్వరితగతిన నిర్మాణాలను పూర్తి చేయాలని మున్సిపల్ సిబ్బందికి సూచించారు. కార్పొరేటర్ కోటూరు ఆంజనేయులు, మున్సిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, వైఎస్ఆర్ సీపీ నాయకులు నల్లాని బాబు, అమర్నాథరెడ్డి పాల్గొన్నారు.

అప్సా రాష్ట్ర అధ్యక్షుడిగా సుబ్రమణ్యంరాజు

తిరుపతి ఎడ్యుకేషన్: ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్(అప్సా) రాష్ట్ర అధ్యక్షుడిగా ఆ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు వి.సుబ్రమణ్యంరాజు ఎన్నికయ్యారు. ఈ నెల 16వ తేదీ విజయవాడలో జరిగిన అప్సా రాష్ట్ర నూతన కార్యవర్గ ఎన్నికల్లో ఆయన రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సుబ్రమణ్యంరాజు ఎన్నికపై పలువురు ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు హర్షం వ్యక్తం చేశారు.

సైన్స్‌సెంటర్‌లో విజ్ఞాన వీచికలు

తిరుపతి కల్చరల్: బాలల దినోత్సవం సందర్భంగా తిరుపతి బాలోత్సవం వారి సహకారంతో బాలల సైన్స్ ఫెస్టివల్‌లో సైన్స్ విజ్ఞానం వెల్లివిరిసింది. రెండు రోజులపాటు సైన్స్ సెంటర్‌లో విద్యార్థులతో సైన్స్ ఎగ్జిబిషన్స్, సైన్స్ ఇతివృత్తంగా నాటక ప్రదర్శనలతో శుక్రవారం బాలల ఫెస్టివల్ ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి టీటీడీ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ టి.దేవేంద్రబాబు హాజరయ్యారు. విద్యార్థులు సుమారు 50కిపైగా సైన్స్ టెక్నాలజీ, ఇంజినీరింగ్ అండ్ మ్యాథమేటిక్స్ వంటి అంశాలపై ప్రదర్శించిన నమూనాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. శనివారం కూడా సైన్స్ సెంటర్‌లో ఈ బాలల సైన్స్ ఫెస్టివల్ కొనసాగుతుందని ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రూ తెలిపారు. తిరుపతి బాలోత్సవం గౌరవాధ్యక్షుడు టెంకాయల దామోదరం, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజలు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ సీపీ నేత సిరిగల రాజన్న మృతి



భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలం చిట్టేచర్ల గ్రామ పంచాయతీ వైఎస్ఆర్ సీపీ నేత సిరిగల రాజన్న మృతికి తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అంజలి ఘటించారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందగా ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలతో నివాళులర్పించారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతున్ని ప్రార్థించారు. సిరిగల రాజన్న కుటుంబసభ్యులకు తమ కుటుంబం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మృతుడి కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పి ఓదార్చారు.

జగనన్న పాలనలోనే బడుగులకు పెద్దపీట



తిరుపతి మంగళం: సమాజంలో ఎదుగుబొదుగు లేకుండా అట్టడుగు వర్గాలుగా నిలిచిపోయిన బడుగు బలహీనవర్గాలకు రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక పెద్దపీట వేశారని జనని వెల్ఫేర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, వైఎస్ఆర్ సీపీ సీనియర్ నాయకుడు ఎంపీఎస్ మణి తెలిపారు. తిరుపతి ఎంఆర్‌పల్లిలోని ఎంపీఎస్ మణి కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తొండమల్ల పుల్లయ్య, రాష్ట్ర వక్ఫ్ బోర్డు మెంబర్ సయ్యద్ షఫీ అహ్మద్ ఖాదరీలను ఆయన దుశ్శాలువాలతో సత్కరించారు. రాష్ట్రంలో జగనన్న, తిరుపతిలో ఎమ్మెల్యే కరుణన్న నిత్యం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఉన్నత పదవులు కల్పించి సమాజంలో ఉన్నత స్థానాన్ని కల్పిస్తున్న దేవుళ్లు వారు అని కొనియాడారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నను సీఎంగా తిరిగి గెలిపించుకునేందుకు బడుగు బలహీన వర్గాలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీవెన్స్‌సెల్ జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి రమేష్, పార్టీ నాయకులు సాకం ప్రభాకర్, బాబూయాదవ్ పాల్గొన్నారు.

దివ్యానుగ్రహ హోమానికి భూమనకు ఆహ్వానం

టీటీడీ పాలకమండలి సమావేశంలో నిర్ణయించిన విధంగా శ్రీ శ్రీనివాస దివ్యానుగ్రహ విశేష హోమం ఈ నెల 23వ తేదీ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో తిరుపతి పద్మావతిపురంలోని ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం వేద పండితులు, అధికారులు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిని కలిసి గజమాలలతో సత్కరించి వేదమంత్రాలతో ఆశీర్వదించారు. అనంతరం శ్రీ శ్రీనివాస దివ్యానుగ్రహ హోమానికి ఆహ్వానం పలికారు. –తిరుపతి మంగళం



హోమానికి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిని ఆహ్వానిస్తున్న వేదపండితులు, అధికారులు

సంక్షేమాభివృద్ధికి జగనన్న పెద్దపీట



సమావేశంలో మాట్లాడుతున్న తుడా చైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

- తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

భాకరాపేట: సంక్షేమాభివృద్ధికి జగనన్న ప్రభుత్వం పెద్ద పీట వేసిందని తుడా చైర్మన్, వైఎస్ఆర్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎర్రావారిపాలెం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ శివలక్ష్మీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ ఎర్రావారిపాలెం మండలంలో ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో దాదాపు రూ.40 కోట్ల తుడా నిధులతో గ్రామాలను అభివృద్ధి చేశామన్నారు. భారతదేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను రోల్‌మోడల్‌గా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి చేశారన్నారు. ప్రతిపక్షాల విమర్శలు బాధాకరమని, గ్రామాల్లోకి వెళ్లి అభివృద్ధిని చూసి మాట్లాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కరుణాకర్‌రెడ్డి, ఎంపీడీఓ అమర్‌నాథ్, తహశీల్దార్ దస్తగిరి, ఎంపీటీసీలు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

తిరుపతి రూపురేఖలు మార్చేలా అభివృద్ధి



రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ రెడ్డి

- డిప్యూటీ మేయర్ భూమన అభినయ రెడ్డి

తిరుపతి తుడా: తిరుపతి నగర రూపు రేఖలు మార్చేలా అభివృద్ధి ప్రణాళికలు అమలు చేస్తున్నామని నగర డిప్యూటీ మేయర్ భూమన అభినయ రెడ్డి తెలిపారు మున్సిపల్ పార్కు కూడలి నుంచి దోబీ ఘాట్ మీదుగా సత్యనారాయణపురం వరకు 40 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డును నిర్మిస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణ పనులను డిప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవసరం ఉన్న ప్రతి చోటా కొత్త రోడ్లు వేయడంతోపాటు ఉన్న రోడ్లను ట్రాఫిక్ తగ్గట్టు విస్తరిస్తున్నామని చెప్పారు. ప్రకాశం పార్క్ కూడలి నుంచి దోబి ఘాట్ మీదుగా సత్యనారాయణపురం కూడలి వరకు 40 అడుగుల ప్రతిపాదిత రోడ్డు దశాబ్దాలుగా కాగితాలకే పరిమితమైందన్నారు. ఆ రోడ్డు అవశ్యకతను గుర్తించి యుద్ధ ప్రాతిపాదికన విస్తరణ పనులు చేపట్టామన్నారు. లింక్ రోడ్ల వల్ల ట్రాఫిక్ ఒత్తిడి తగ్గడంతోపాటు సుమాయాసంగా ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి చేరుకునేందుకు దోహదపడతాయని చెప్పారు. నగరంలో చేపట్టిన 18 మాస్టర్ ప్లాన్ రోడ్లతో తిరుపతి మరో 5 వేల ఎకరాల్లో విస్తరించి ఉంది అన్నారు. రాబోయే రోజుల్లో తిరుపతి మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆయన ఆకాంక్షించారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

పాకాల: ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మారసాని విజయ్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ రేపు(ఆదివారం) చెన్నై శంకర నేత్రాలయ ఆస్పత్రి వారి సహకారంతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని, కంటి సమస్యలతో బాధపడుతున్నవారు ఈ శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకోవచ్చని తెలిపారు. వైద్యం కోసం వచ్చే వారు తప్పనిసరిగా తమ వెంట ఆధార్‌కార్డును తీసుకుని రావాలన్నారు. కంటి శస్త్ర చికిత్స అవసరం ఉన్నవారిని చెన్నైకి తీసుకెళ్లి, ఉచితంగా ఆపరేషన్ చేస్తారని, అలాగే ఉచితంగా భోజనం, వసతి ఏర్పాటు చేస్తారని తెలిపారు. రెటీనా, గ్లోకోమా చికిత్సలు కూడా చేస్తారని వివరించారు.

నెక్సా లాంగ్ టర్న్ ఈవెంట్ సెంటర్ ప్రారంభం




నెక్సా లాంగ్ టర్న్ ఈవెంట్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

తిరుపతి కల్చరల్: చిత్తూరు కలెక్టర్ ఆఫీస్ దగ్గర భార్గవి ఆటోమొబైల్స్ వారు నూతనంగా ఏర్పాటు చేసిన భారతదేశంలోనే నెంబర్ కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకి నెక్సా లాంగ్ టర్న్ ఈవెంట్ సెంటర్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, చిత్తూరు రూరల్ సర్పంచ్ ఎస్ఎస్.రజనీకాంత్ హాజరై నెక్సా లాంగ్ టర్న్ ఈవెంట్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కస్టమర్లు, బ్యాంకర్లు, ఫైనాన్షియర్లు, భార్గవి ఆటోమొబైల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

టీటీడీ చైర్మన్ భూమనకు మంత్రి అంబటి సత్కారం

తిరుపతి మంగళం: టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిని రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు దుశ్శాలువా కప్పి పుష్పగుచ్ఛంతో సత్కరించారు. తిరుపతి పద్మావతిపురంలోని ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం మంత్రి అంబటి రాంబాబు ఎమ్మెల్యే కరుణాకరరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీవారి సేవతో పాటు టీటీడీ ఉద్యోగులపై కరుణ చూపుతూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని, తిరుపతి చరిత్రలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి మీకే సాధ్యమైయిందన్నా అంటూ ప్రత్యేకంగా అభినందించారు.



ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిని పుష్పగుచ్ఛంతో అభినందిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

అలరించిన కవి సమ్మేళనం


తిరుపతి అర్బన్: 56వ గ్రంథాలయ జాతీయ వారోత్సవాలను పురస్కరించుకొని గోవిందరాజస్వామి దక్షిణ మాడవీధిలోని ప్రాంతీయ ప్రభుత్వ గ్రంథాలయంలో శుక్రవారం ఉదయం కవి సమ్మేళనం చేపట్టారు. భారత స్వతంత్ర పోరాటం ప్రధాన అంశంగా సాగిన ఈ కవి సమ్మేళనానికి సభాధ్యక్షులుగా డాక్టర్ నేమిలేటి కిట్టన్న వ్యవహరించారు. ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ పాలకుల దమన నీతి మొదలుకొని మొదటి సైనిక తిరుగుబాటు నుండి మహాత్మా గాంధీ సారధ్యంలో అహింసా మార్గంలో భారతీయులు ఉద్యమ బాటలో స్వతంత్రాన్ని సాధించిన విధివిధానాలను ప్రస్తావించారు. ప్రముఖులను చివరిగా సన్మానించారు. డాక్టర్ మన్నవ గంగాధర ప్రసాద్, డాక్టర్ కలువగుంట రామమూర్తి, ప్రముఖ కథా రచయిత, కవి పేరూరు బాలసుబ్రమణ్యం, రచయిత సురేంద్ర రొడ్డ, గ్రంథాలయాధికారి సత్యనారాయణమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రముఖులకు సన్మానం

టీటీడీలో 'ధర్మ' పాలన

- టీటీడీ ఈవో ధర్మారెడ్డిపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటు
- మాజీ పాలకమండలి సభ్యులు పోకల అశోక్‌కుమార్



తిరుపతి మంగళం: టీటీడీలో ఈవోగా ధర్మారెడ్డిని నియమించాక టీటీడీలో ధర్మ పాలన సాగిస్తున్నారని టీటీడీ మాజీ పాలకమండలి సభ్యులు పోకల అశోక్‌కుమార్ తెలిపారు. దేశంలోనే అతి పెద్ద ధార్మిక సంస్థ అయిన టీటీడీలో ఈవోగా శ్రీవారికి విశేష సేవలు చేసి, ఉద్యోగులతో సమపాలన సాగిస్తున్న గొప్ప అధికారి ఈవో ధర్మారెడ్డి అన్నారు. అలాంటి అధికారిపైన టీడీపీ నాయకుడు ఆనం వెంకటరమణారెడ్డి నోటికి వచ్చినట్లు ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు. ఈవోగా ధర్మారెడ్డి వచ్చాక టీటీడీ ఎంతో అభివృద్ధి చెందిందని, సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తున్నారన్నారు. కేవలం రాజకీయ పబ్లిసిటీ కోసం ధర్మారెడ్డిపై అసత్య ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. రాజకీయ లబ్ధి కోసం, చంద్రబాబు మెప్పు పొందేందుకు రాజకీయ బ్రోకర్‌గా ఆనం మారాడని మండిపడ్డారు. ధర్మారెడ్డి ఈవోగా వచ్చాకే గోశాల అభివృద్ధి, అగరుబత్తీల తయారీతో వందల మందికి ఉద్యోగాలు, ఆలయ పునఃనిర్మాణాలు వంటి అనేక గొప్ప కార్యక్రమాలను చేపట్టారన్నారు. ఢిల్లీ స్థాయిలో పనిచేసి వచ్చిన ధర్మారెడ్డిని విమర్శించే స్థాయి గల్లీ నాయకుడైన ఆనంకు ఉందా అంటూ మండిపడ్డారు. ఇలాంటి అసత్య ఆరోపణలు చేస్తే శ్రీవారి భక్తులే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

చంద్రగిరి: అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను చంద్రగిరి పోలీసులు శుక్రవారం సీజ్ చేశారు. మండల పరిధిలోని ఏ.రంగంపేట పరిసర ప్రాంతాల్లో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు ఏ.రంగంపేట వద్ద అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న టీడీపీ నాయకులకు చెందిన రెండు ఇసుక ట్రాక్టర్‌లను పట్టుకున్నారు. అనంతరం ట్రాక్టర్‌లను పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నపిల్లల ఆసుపత్రిలో ఘనంగా బాలల దినోత్సవం

తిరుపతి తుడా: రుయా ఆసుపత్రి చిన్న పిల్లల విభాగంలో ఎస్వీ వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్, రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి రవిప్రభు, చిన్న పిల్లల విభాగాధిపతి డాక్టర్ మనోహర్ ఆధ్వర్యంలో చాచా నెహ్రూ జన్మదినోత్సవం పురస్కరించుకొని, చిన్నపిల్లల దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి, ఉచితంగా కళ్లజోళ్లు అందించారు. వినికిడి లోపంతో బాధపడుతున్న పిల్లలకు పరీక్షలు నిర్వహించి హియరింగ్ ఎయిడ్ వినికిడి పరికరాలు అందజేశారు. అనంతరం చిన్న పిల్లలకు, తల్లిదండ్రులకు రంగుల పోటీలు, బొమ్మల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ వినీషా, డాక్టర్ ప్రదీప్, పారామెడికల్ సిబ్బంది, మేనేజర్ డాక్టర్ గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నపిల్లల విభాగంలో బాలల దినోత్సవం

వలంటీర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

తిరుపతి రూరల్: మండలంలోని పలు పంచాయతీల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ల పోస్టులకు అర్హులైన స్థానిక యువత దరఖాస్తు చేసుకోవాలని రూరల్ మండల ఎంపీడీఓ రమేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో మొత్తం 99 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. తిరుచానూరులో అత్యధికంగా 44, పాడిపేట–19, శెట్టిపల్లి–13, బ్రాహ్మణపట్టు–6, పద్మావతిపురం–5, సాయినగర్–4, అవిలాల–2, చిగురువాడ, గొల్లపల్లి, ముండ్లపూడి, పుదిపట్ల, తనపల్లి, తుమ్మలగుంట పంచాయతీల్లో ఒక్కొక్కటి చొప్పున మొత్తం 99 వలంటీర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైనవారు ఈ నెల 26వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు చేసుకున్నవారికి మాత్రమే 28వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి తిరుపతి రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు.

టీటీడీ ప్రతిష్టను దిగజార్చడమే టీడీపీ నేతల నైజం

తిరుపతి కల్చరల్: రాజకీయ స్వార్థం కోసం నిరంతరం తప్పుడు ప్రచారాలు చేసి ప్రజల్ని తప్పుదారి పట్టించి తద్వారా టీటీడీ ప్రతిష్టను దిగజార్చడమే టీడీపీ నేతల నైజమని వైఎస్ఆర్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఆర్‌ఏ.అజయ్‌కుమార్ విమర్శించారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ నిజాయితీ గల అధికారి అయిన టీటీడీ ఈవో ఏవీ.ధర్మారెడ్డిని టార్గెట్ చేసి టీడీపీ నేత ఆనం వెంకటరమణారెడ్డి విమర్శలు చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్మబద్ధంగా టీటీడీ ఈవో శ్రీవారి సేవ చేస్తున్నారని, అలాంటి సమర్థులైన వారిపై పిచ్చికుక్కలా విమర్శలు దిగితే సహించమని హెచ్చరించారు. వైఎస్ఆర్‌సీపీ యువజన విభాగం నేతలు రాజ్‌కుమార్, రాము పాల్గొన్నారు.

వైద్యుల సంరక్షణే ధ్యేయంగా పని చేయాలి

తిరుపతి తుడా: వైద్యుల సంరక్షణ ధ్యేయంగా ఐఎంఏ పని చేయాలని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం పేర్కొన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తిరుపతి శాఖ నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎమ్మెల్సీ కార్యాలయంలో నూతన కమిటీని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని కోరారు. ఐఎంఏ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ శ్రీహరి రావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఐఎంఏ పటిష్టంగా ఉందన్నారు. తిరుపతి శాఖ అధ్యక్ష కార్యదర్శులుగా డాక్టర్ జనార్దన్, డాక్టర్ వెంకటరమణ నియమితులయ్యారు. కోశాధికారిగా డాక్టర్ కృష్ణకాంత్, ఉపాధ్యక్షులుగా మరో ఆరుగురు, సహాయ కార్యదర్శులుగా ఆరుగురితోపాటు ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా 12 మందిని ఎంపిక చేశారు.

బాలికలను రక్షించాలి.. చదివించాలి

తిరుపతి అర్బన్: బాలికలను సంరక్షించడంతో పాటు ఉన్నతస్థాయికి చేరుకునేలా చదివించాలని డీఆర్వో పెంచల కిషోర్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా స్త్రీ శిశు అభివృద్ధి సంస్థ నేతృత్వంలో కలెక్టరేట్ భేటీ బచావో అండ్ భేటీ పడావో (బాలికను రక్షించండి – బాలికను చదివించండి) పై జిల్లా స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. లీడ్ బ్యాంకు మేనేజర్ సుభాష్ పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు



రాష్ట్ర మంత్రి ఆర్కే రోజా, జబర్దస్త్ టీం, మంత్రి అంబటి రాంబాబు, ముక్క మాల మల్ల స్వామి మఠం పీఠాధిపతి శ్రీధర్ శర్మ

తిరుమల: తిరుమల శ్రీవారిని శుక్రవారం రాష్ట్ర మంత్రులు ఆర్కే రోజా, అంబటి రాంబాబు, ముక్కమాల మల్ల స్వామి మఠం పీఠాధిపతి శ్రీధర్ శర్మ, రాజ్యసభ సభ్యులు సుజనాచౌదరి, జబర్దస్త్ టీం సభ్యులు దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

సేవకు ప్రతిరూపం ఎమ్మెల్యే చెవిరెడ్డి

- మల్లంగుంటలో చెవిరెడ్డి పెళ్లికానుకను అందించిన వైస్ ఎంపీపీ మాధవరెడ్డి

తిరుపతి రూరల్: నమ్మి ఆదరించిన ప్రజల కోసం నిరంతరం తపించే ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సేవకు ప్రతిరూపమని తిరుపతి రూరల్ వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి కొనియాడారు. రూరల్ మండలం మల్లంగుంటలో చెంగయ్య, గిరిజ దంపతుల కుమార్తె పవిత్ర వివాహం నేపథ్యంలో ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అందించిన పెళ్లికానుకను వధువు తల్లిదండ్రులకు శుక్రవారం అందించారు. మాధవరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాలు అని నిరూపించిన గొప్ప రాజకీయవేత్త ఎమ్మెల్యే చెవిరెడ్డి అని కొనియాడారు. సొంత నిధులను వెచ్చించి పెళ్లి కానుకను ఉచితంగా అందిస్తున్నారన్నారు. వైఎస్ఆర్‌టీయూసీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు ఉపేంద్రరెడ్డి, సర్పంచ్ జానకీ, రామచంద్రయ్య, ఎంపీటీసీ విజయలక్ష్మి, హేమాద్రి, పాల్గొన్నారు.



పెళ్లికానుకను అందిస్తున్న వైస్ ఎంపీపీ

పాకాలలో..

వరదప్పనాయుడుపేట గ్రామం, తువ్వచేను కొత్త ఒడ్డిపల్లి గ్రామాల్లో నూతనంగా పెళ్లి చేసుకోబోతున్న వధూవరులకు చంద్రగిరి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పెళ్లి కానుకను అందజేశారు. వరదప్పనాయుడుపేటలో చందు, పావనిలకు, అలాగే ఉప్పరపల్లి పంచాయతీ, తువ్వచేనుకొత్త ఒడ్డిపల్లి గ్రామంలో ఉమాపతి, ఢిల్లీరాణిలకు పెళ్లికానుకను అందజేశారు. స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లివేడు విక్రమ్‌రెడ్డి, సర్పంచ్ గౌరీశంకర్‌రాజు, ఎంపీటీసీ సురేష్, నాగరాజనాయుడు, రామలింగారెడ్డి, మునిరత్నంరెడ్డి, హేమంత్‌రెడ్డి, సురేంద్ర, నాగరాజ్, పరదేశి, బాబురెడ్డి, ప్రదీప్, సుబ్రమణ్యం, మస్తాన్ పాల్గొన్నారు.



కానుక అందజేస్తున్న వల్లివేడు విక్రమ్‌రెడ్డి



పెళ్లికానుకను అందిస్తున్న నాయకులు

ఎమ్మెల్యే వివాహ కానుక పంపిణీ

చంద్రగిరి: కొత్తశానంబట్లకు చెందిన బేబి, ధనశేఖర్‌లకు వివాహం నిశ్చయమైంది. చంద్రగిరి పార్టీ డివిజన్ అధ్యక్షుడు పసల నాగరాజు, సర్పంచ్ యశోద, శంకర్ యాదవ్‌లతో కలసి నూతన వధూవరులకు ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పంపించిన కానుకను వధూవరులకు అందించారు.

జాగ్రత్తలు తీసుకోండి

తిరుపతి తుడా: ఓటర్ల నుంచి వచ్చిన క్లెయిమ్లను క్షుణ్ణంగా పరిశీలించేందుకు సమష్టిగా చర్యలు తీసుకోవాలని తిరుపతి నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి డి.హరిత సూచించారు. ఎన్నికల సిబ్బందితో శుక్రవారం ఆమె సమీక్ష నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర రెడ్డి, అర్బన్ తహసీల్దార్ వెంకటరమణ, రెవెన్యూ అధికారులు కేఎల్ వర్మ, సేతు మాధవ్, సెక్టోరల్ ఆఫీసర్స్, సూపర్‌వైజర్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి కేసులో ముగ్గురికి రిమాండ్

తిరుపతి లీగల్: రేణిగుంట పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయిని అక్రమంగా తరలిస్తున్న కేసులో ముగ్గురికి 15 రోజులపాటు రిమాండ్ విధిస్తూ తిరుపతి మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. తిరుపతి ఎస్టీవీ నగర్‌కు చెందిన బి.విజయ్, భూపతి వాసు, తిరుపతి బైరాగిపట్టెడ భగత్ సింగ్ కాలనీకి చెందిన జె.వెంకటేష్‌లను రేణిగుంట పోలీసులు అరెస్ట్ చేసి శుక్రవారం రాత్రి న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు.